
www.prajasakti.com
# ప్రజాశక్తి
గురువారం 6 ఏప్రిల్ 2023
5
తూర్పుగోదావరి



## టెలీ రేడియాలజీ సేవలు ప్రారంభం

**ప్రజాశక్తి-కడియం**

కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో టెలీ రేడియాలజీ సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. దేశ మాజీ ఉప ప్రధాని, గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని, ఈ సేవలను అందుబాటులోనికి తీసుకురావడం సంతోషంగా ఉందని సూపరింటెండెంట్ అన్నారు. డాక్టర్ శ్రీధర్, రేడియోగ్రాఫర్ రవి కుమార్ పాల్గొన్నారు.



సేవలను ప్రారంభిస్తున్న శ్రీధర్

# ఔషధాల ధరలకు రెక్కలు

- 10 శాతం పెంపు అమలు
- 354 మందులు ఇక ధరాభారం
- ఆందోళనలో దీర్ఘకాలిక వ్యాధుల రోగులు



**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

అనారోగ్యం నుంచి ఉపశమనం కోసం వినియోగించే మందుల ధరలు పెంపునకు రంగం సిద్ధమయ్యింది. ముడి సరుకుల ధరలు పెరిగాయన్న కారణంతో కంపెనీల నిర్వాహకులు పెద్ద మొత్తంలో మందుల ధరలను పెంచేశారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలో నడిచే 'నేషనల్ ఫార్మాస్యూటికల్ మినిస్ట్రీ ఆఫ్ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్' అనే సంస్థ 354 అత్యవసర మందుల ధరలను నిర్ణయిస్తుంది. వీటితోపాటు మరో 13 రకాల మందులను, లిక్విడ్ ఆక్సిజన ధరలను కూడా నిర్ణయిస్తుంది. ఏప్రిల్ నుంచి కంపెనీలు మందుల ధరలను 10 శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కొవిడ్ నేపథ్యంతో రెండేళ్ల నుంచి జిల్లాలో మందుల వినియోగం పెరిగింది. సీలింగ్ ప్రైస్‌తో పాటు ట్యాక్స్ కలిపి మందుల ఎమ్మార్పీ నిర్ణయిస్తారు. జిల్లావ్యాప్తంగా రిటైల్ మందుల షాపులు సుమారు 2,896 హోల్‌సేల్ షాపులు 982 వరకు ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ విక్రయాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా అత్యధికులు ప్రైవేటు షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు.

**ధరలు పెరగనున్నాయి ఇలా**

మధుమేహానికి రూ.205కు లభ్యమయ్యే మందులు ఇప్పుడు రూ.225కు చేరనున్నాయి. గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడే వారు ప్రముఖ కంపెనీకి చెందిన 15 టాబ్లెట్స్ గరిష్టంగా రూ.310 వెచ్చించేవారు. ఇప్పుడు రూ.340కి చేరనున్నాయి. రక్తపోటు కోసం రూ.200 చెల్లించే వారు ఇకపై రూ.220 చెల్లించాల్సి ఉంటుంది. ప్రజలు అత్యధికంగా వినియోగించే ఐరన్ మాత్రల ధరలు కూడా పెరిగాయి. గతంలో 10 టాబ్లెట్స్ రూ.160కి విక్రయించేవారు. ఇప్పుడు ఒక కంపెనీ రూ.176కి ధరలు పెరగనున్నాయి. కొన్ని రకాల మందులు కంపెనీలను బట్టి ధరలు మారుతున్నాయి. మొత్తం మీద సామాన్యులపై ఈ పెంపు పెను భారం కానుంది అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రముఖ ఆసుపత్రుల్లో అధిక ధరల దోపిడి**

ప్రముఖ ఆస్పత్రుల్లో అధిక దొరల దోపిడీ జరుగుతోంది. అక్కడ యాజమాన్యాలు మందుల పేరిట జేబులను ఖాళీ చేస్తున్నారు. కొన్ని మెడికల్ షాప్స్‌లో 10 నుంచి 15 శాతం రాయితీ ఇస్తున్నారు. ఔషధ దుకాణాల వద్ద డిస్కౌంట్ బోర్డులు కూడా కనిపిస్తాయి. ప్రైవేటు ఆసుపత్రులను నిర్వహిస్తున్న వైద్యులు రాసిన మందులను అదే ఆసుపత్రుల్లో ఉండే షాపుల్లో రోగులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొందరు వైద్యులే మందుల షాపులను నిర్వహిస్తున్నారు. కొన్ని ఆసుపత్రులలో వైద్యులు రాసిన మందులు అక్కడి ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌ల్లో తప్ప బయట ఎక్కడా దొరకవు. దీంతో రోగులు తప్పనిసరిగా అక్కడే, అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యులు నిర్వహిస్తున్న మెడికల్ షాపుల్లో మందులకు రాయితీ ఇవ్వడం లేదు. అయితే ఎమ్మార్పీ ధరకు అదనంగా ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవని ఔషధ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**మందుల ధరల పెంపు పెను భారమే**

గుండె నొప్పి సమస్యతో బాధ పడుతున్నాను. రోజు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలి. గతంలో మందుల కోసం నెలకు రూ.1500 ఖర్చు అయ్యేది. తాజాగా ధరలు పెరగడంతో నెలవారీ మందుల బడ్జెట్ మారిపోనుంది. ఆదాయాలు లేక ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై ఇది పెను భారమే. ఉన్నతాధికారులు దష్టి సారించాలి.

**- ఎస్.రవికుమార్ రాజమహేంద్రవరం**

**రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి**

ప్రైవేటు ఆసుపత్రుల్లో మందులకు రాయితీ ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. ఔషధ నియంత్రణ శాఖ పర్యవేక్షణ పెరగాలి. బయట మెడికల్ షాపుల్లో మందులపై 10 నుంచి 15 శాతం రాయితీ ఇస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించే మెడికల్‌షాపుల్లో డిస్కౌంట్ ఇవ్వడం లేదు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని ప్రైవేటు ఆసుపత్రుల్లో రాయితీలు అమలు చేసి ప్రజలకు ఊరట కల్పించాలి.

**బి.దుర్గారావు రాజమహేంద్రవరం**

## 14 నుంచి మోడీ విధానాలపై ప్రచార ఆందోళన

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మతోన్మాద, రాజ్యాంగ, లౌకిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14 నుండి 30 వరకు తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గ్రామ గ్రామానా ప్రచార ఆందోళన నిర్వహిస్తున్నట్లు సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ పిలుపునిచ్చారు. సిపిఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ సూచనలతో మోడీ పాలన చేస్తున్నారని, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. మతోన్మాదం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసి అఖండ హిందూ భారత్ పిలుపుని అమలు చేయాలనుకుంటున్నారన్నారు. భారతదేశం భిన్న జాతులు భిన్న సంస్కృతులు భిన్న భాషలగల దేశమని అటువంటి భారతదేశాన్ని నరేంద్ర మోడీ హిందూ మతోన్మాదంగా మార్చాలని కుట్ర చేస్తున్నారన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వం రంగసంస్థలను అమ్మేసి బడా కార్పొరేట్‌లకు దోచిపెడుతున్నట్టు చెప్పారు. దేశ సహజ సంపదను అదానీ అంబానీ చేతుల్లో పెడుతున్నారన్నారు. దేశంలో దళిత మైనార్టీ వర్గాలపై దాడులు విపరీతంగా చేస్తున్నారని వారు తెలిపారు. విశాఖ ఉక్కు పోరాటం 700 రోజులు పైబడినా ఇప్పటికీ రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు నోరు మెదపడం లేదన్నారు. ఏడు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహిస్తామని, ఈ నెల 28న రాజమండ్రి కోటిపల్లి బస్టాండ్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. దీనికి సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కోండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, ఎం.సుందర్ బాబు, జువ్వల రాంబాబు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న నాయకులు

## నవధాన్యాల సాగుతో లబ్ధి

**ప్రజాశక్తి - ఉండ్రాజవరం**

రైతులు వరి పంటను కోసిన తర్వాత చేను ఖాళీగా ఉంచకుండా నవధాన్యాలు సాగు చేయాలని ఎపి ప్రకతి వ్యవసాయ శాఖ విభాగం మాస్టర్ ట్రైనర్ మహేష్ సూచించారు. బుధవారం మండలంలోని తాడిపర్రులో ఏర్పాటు చేసిన రైతులకు నవధాన్యాల కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేలకు నవధాన్యాలు సాగు పేరుతో ప్రభుత్వం ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. సాంప్రదాయ పంటల సాగుకు అండగా నిలవడం, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, భూసారాన్ని పెంచడం, ప్రజలకు సహజమైన ఆహార ఉత్పత్తులను అందించడం నవధాన్యాలు సాగు యొక్క ఉద్దేశమన్నారు. ఇందుకోసం ప్రకతి వ్యవసాయ విభాగం విశేషంగా పని చేస్తుందన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఈ సంవత్సరం మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల్లో 600 ఎకరాల్లో ప్రకతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించడానికి సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మూడో పంట సాగు కోసం 30 రకాల పప్పు ధాన్యాలు, నూనె జాతులు, చిరుధాన్యాలు, విభిన్న జాతుల ఆకుకూరలు, విత్తనాలతో కూడిన 13 కేజీల కిట్‌ను నామమాత్రపు ధరకు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. మండల ఇన్‌ఛార్జి భవాని మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ద్వారా సంఘాల నుంచి ఈ విత్తనాల కోసం లోన్లు తీసుకోవడం, ప్రకతి వ్యవసాయ వనరుల షాపు నుంచి పెట్టుబడి పెట్టి ముందుగా రైతులకు కిట్స్ తయారు చేస్తున్నామన్నారు.

## వైఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షునిగా వేణు

**ప్రజాశక్తి-గోపాలపురం**

వైయస్సార్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షునిగా గోపవరానికి చెందిన సాలి వేణు నియమితులయ్యారు. తన నియామకంపై ఫౌండేషన్ ఛైర్మెన్ అన్నపురెడ్డి విజయభాస్కర్ రెడ్డికి వేణు కృతజ్ఞతలు తెలిపారు.

## రాహుల్‌పై వేటు దారుణం

**ప్రజాశక్తి -గోకవరం**

రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై రద్దు వేటు వేయడం దారుణమని మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు గుల్లా ఏడుకొండలు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక పార్టీకి చెందిన నాయకుడిగా రాజకీయ విమర్శలు చేసిన రాహుల్ గాంధీకి కోర్టు శిక్ష విధించడం వెను వెంటనే పార్లమెంటు సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయడం ఎంపీగా ఆయన క్వార్టర్‌ను ఖాళీ చేయాలని ఆదేశించడం బాధాకరమన్నారు.

# 7 నుంచి గడప గడపకూ..

**ప్రజాశక్తి -దేవరపల్లి**

గోపాలపురం క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు జగనన్న మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుండి 14వ తేదీ వరకు ప్రతి గ్రామంలో గృహ సారథులు సచివాలయ కన్వీనర్లు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, జెడ్‌పిటిసి పొట్టి స్వర్ణలత, పార్టీ మండల ప్రెసిడెంట్ కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రమాప్రభ, మండలంలోని వైసిపి నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కిసాన్ మజ్దూర్ ఆందోళనకు ఎల్ఐసి మద్దతు

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న కిసాన్ మజ్దూర్ సంఘ్ ర్యాలీకి మద్దతుగా రాజమండ్రిలో జీవిత బీమా ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. స్థానిక మోరంపూడి జీవిత బీమా సంస్థ డివిజనల్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన ధర్నాను ఉద్దేశించి జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కోదండరామ్, జి.రాంబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని, పెన్షన్ రూ.10,000 పెంచాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ సౌకర్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ లేబర్, డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న ప్రధాన డిమాండ్లను సాధించే దిశగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలందరూ దీనిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు జి.శ్రీనివాస్, సిహెచ్.సత్యదేవ, శిరీష, ఈశ్వరరావు, గన్నయ్య, శ్రీనివాస్, విశ్వనాథ్, రాజు, పట్నాయక్, దొరబాబు, సాయిబాబు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

# జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శనీయం

**భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. ఆయన 115వ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆయనకు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు.**

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**కొవ్వూరు** హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత కొవ్వూరు క్యాంప్ కార్యాలయంలో, పట్టణంలోని హర్షిత లాడ్జ్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **రాజమహేంద్రవరంలో** కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎంపీ పార్లమెంట్ సభ్యులు మార్గని భరత్ రామ్ జాంపేటలోని చర్చిపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా ఆయనను స్మరించుకోవడం మన కర్తవ్యమని అన్నారు. సామాజిక న్యాయం, విపత్తుల సమయంలో వాటిని ఎలా అధిగమించాలనే లక్ష్యంతో బాబూ జగ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.దినేష్‌కుమార్, జెసి తేజ్ భరత్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జి.జనార్ధనరావు, ఎస్‌సి, ఎస్‌టి నాయకులు టి.రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, డి.ఏసురత్నం, ఎన్.వెంకట్రావు, వి.బాబూరావు, డి.క్రిస్టఫర్, సుధాకర్, వి.వీర్రాజు, అర్థాల కుమార్ బాబు, యు.రామారావు, ఐ.రాజేష్, జి.అజయ్ బాబు, వై.అశోక్ కుమార్, జి.అజయ్ బాబు, కె.నరసింహారావు, సిహెచ్.రాంబాబు, వి.సురేష్, పి.రాజు, ఎం.కపాకర్, అనపర్తి సురేంద్ర, ముప్పిడి రాము, టి.రమణ, టి.వెంకటేశ్వర రావు, ఆర్.మురళి, యశ్వంత్, ఎం.జాన్ వెస్లీ పాల్గొన్నారు. **చాగల్లు** గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎ.అరుణ నివాళులర్పించారు. గుమ్మాపు జాన్, బొనిగే రాంబాబు, గడ్డం సాయిబాబా, ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** వేలివెన్నులో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, నివాళులర్పించారు. ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ మెండె వెంకటరావు, ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ముత్యం వీరాస్వామి నాయుడు, కాంతారావు పాల్గొన్నారు. **తాళ్లపూడిలో** గణాంక అధికారి జోడాల వెంకటేశ్వర రావు నివాళులర్పించారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, నాయకులు పోసిన శ్రీకష్ణదేవరాయలు, మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి, రాపాక తిలక్, తాడిపూడిలో నామ సురేంద్ర నివాళులర్పించారు. **నిడదవోలు** భీమడోలు కిరణ్ కుమార్, రామకష్ణబాబుచ, బైపి రాజేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు, జి రవీంద్రబాబు, గెల్లా రాజు, కాకులపాటి శ్రీధర్, మైనార్టీ నాయకులు షాజహాన్ నివాళులర్పించారు. సుబ్బరాజుపేటలో చెట్టే రామకష్ణ, కైకరపు పెద్ద సుబ్బారావు, తాతపూడి చిన్ని పాల్గొన్నారు. **పెరవలి** కాకరపర్రులో సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్ ముని బాబు, రాంపండు మాస్టారు, రాచర్ల వెంకట్రావు, నేకూరి వసంతం, సిర్రా నాగేశ్వరావు, సొంగ ఆంజనేయులు, సిర్రా శ్రీనివాసు, సొంగా ప్రసాద్, సొంగా పండు, నేకూరి కనకారావు, నేకూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. **ధవళేశ్వరం** ఇందిరా కాలనీలో కొడమంచిలి సూర్య నివాళి అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల రసం, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. మత్సేటి ప్రసాద్, మార్ని వాసుదేవ రావు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, పిన్నింటి ఏకబాబు, యర్రమోతు ధర్మరాజు సావాడ శ్రీనివాస రెడ్డి, వర్రే రాజేష్, ఆంటోని, ఇళ్ల రాంబాబు పాల్గొన్నారు. **కడియంలో** జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి నివాళులర్పించారు. **దేవరపల్లిలో** ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు, ఎంపిపి కెవికె.దుర్గారావు, జెడ్‌పిటిసి పొట్టి స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి నివాళులర్పించారు. **బిక్కవోలు** ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపిపి కొవ్వూరు జ్యోతిర్మయి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు అరవింద్, బొబ్బిలి గంగాభవాని శ్రీనివాస్ పాల్గొన్నారు. బలభద్రపురంలో మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. అబ్బాయి రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **గోకవరంలో** ఎంపిపి సుంకరశ్రీవల్లీ వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రీ సూరారెడ్డి, చింతల అనిల్ కుమార్, రామ్‌ప్రసాద్, నివాళి అర్పించారు. **సీతానగరంలో** పలివెల వీరబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మనెల్లి వెంకట్రావు, మద్దాల కొండలరావు, కొప్పాక రాజారావు పాల్గొన్నారు. జక్కంపూడి రామ్మోహన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.రాజశేఖర్, చిన్నిమిల్లి వెంకటరాయుడు, దాసి వెంకటరావు, పీడీ సుభాషిణి, జెడ్‌పిటిసి వెంకట లక్ష్మి, ఎంపిపి జ్యోత్స్న, డాక్టర్ బాబు, గంటా శ్రీను, కరటూరి హరిబాబు పాల్గొన్నారు. **గోపాలపురంలో** ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఉప్పరగూడెంలోని జగ్జీవన్‌రామ్ పూలమాలలేసి నివాళులర్పించారు. పెద్దగూడెంలో కూసం రామ్మోహన్ రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, మద్దిపాటి రమేష్, జ్యేష్ట శ్రీధర్, తానేటి రాఘవులు, తానేటి స్టీవెన్, కలపాల శేషు, ఫణి కుమార్ పాల్గొన్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఇంజమూరి సుబ్బారావు, జానపాటి చంద్రశేఖర్, ముప్పిడి అశోక్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మంత్రి వనిత

## టిడిపిపై కోవర్ట్ నాయకుల విమర్శలు

**ప్రజాశక్తి - సీతానగరం**

గతంలో టిడిపిలో సీనియర్ నాయకులుగా పనిచేసిన వారే నేటి అధికార వైసిపిలో చేరి తెలుగుదేశం పార్టీపై బురద జల్లుతున్నారని పార్టీ సీనియర్ నాయకుడు ఆచంట రఘురామ్ అన్నారు. బుధవారం వెదుళ్ళపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తూ నేటి ప్రభుత్వానికి కోవర్టులుగా పనిచేయడం చాలా బాధాకరమన్నారు. డబ్బు సంపాదించాలంటే ఇలాంటి అడ్డదారులు తొక్కడం ఎందుకని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో అధికార పార్టీ నాయకులు పెడుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ ఇన్‌ఛార్జి పదవికి మాత్రమే రాజీనామా చేశారని, ఆయన పార్టీలోనే కొనసాగుతున్నారన్నారు. నియోజకవర్గ బాధ్యతలను చంద్రబాబు ఎవరికిచ్చినా కార్యకర్తలంతా ఒక్క తాటిపై నిలబడి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల పద్దరాజు, పిచ్చుకల బాపన్న, గారపాటి సత్యనారాయణ, ముసలపల్లి గంగాధరం, సిక్కిరెడ్డి నాగబాబు పాల్గొన్నారు.

**కార్టూ'నిజం'**




# మహిళల సంక్షేమమే జగనన్న లక్ష్యం

**మహిళల సంక్షేమమే సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆసరా పథకంలో భాగంగా బుధవారం చెక్కులు అందజేశారు.**

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**రాజమహేంద్రవరం** నగరంలోని 36, 39 డివిజన్లకు చెందిన వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల సమావేశం తుమ్మలావ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ భరత్ మాట్లాడారు. టిడిపి చంద్రబాబు హయాంలో పెత్తందారీ వ్యవస్థ నడిచేదని, అర్హులెవరికీ ఎటువంటి సంక్షేమ ఫలాలు అందేవి కావన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో పట్టుకుని పీడించేవారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సిఎం జగన్ జమ చేశారన్నారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, దళారుల ప్రమేయం ఉండదని, 'పేదరికమే' అర్హతగా సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందుతాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైపిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, లంకా ప్రసాద్, కొమ్మోజు దుర్గారావు, గుంటముక్కల రాజు, నందం స్వామి, సంకిస భవానీ ప్రియ, నక్కా నగేష్, పిట్టా రామకష్ణ, పాలిక శ్రీను, పోలు విజయలక్ష్మి, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, బర్రే కొండబాబు, గారా చంటిబాబు, ఉల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం** మండలంలోని పొదుపు సంఘాలకు ఆసరా పథకం కింద మూడో విడత ఆర్థిక సాయం పంపిణీ సభలో రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా ఆర్థికంగా సాధికారత లేక మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన జగన్మోహన్ రెడ్డి మహిళల ఆర్థిక సుస్థిరత కోసమే పలు పథకాలకు రూపకల్పనచేసి అమలు చేస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 5,257 సంఘాలకుగాను 55 వేల మంది లబ్ధిదారులకు మూడేళ్లలో ఒక్క రూ.135 కోట్ల వైఎస్ఆర్ ఆసరా సాయం అందించామని తెలిపారు. సీతానగరం మండలానికి ఒక్క రోజే దాదాపు 1629 సంఘాల్లోని 16,290 మంది సభ్యులకు రూ.13.94 కోట్లు సాయం అందిస్తున్నామని తెలిపారు. **ధవళేశ్వరం** సచివాలయం-2 పరిధిలోని వాడపేటలో నివసిస్తున్న గుమ్మడి గోవింద్ మతి చెందగా ఆ కుటుంబానికి ఆసరాగా వైస్సార్ బీమా పథకంలో అత్యవసర ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వరావు ఆదేశాల మేరకు తలారి ప్రసాద్ అందజేశారు. మిగతా సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో తొందర్లో పడుతుందని సచివాలయం వెల్ఫేర్ ఆఫీసర్ శ్యామ్యూల్ తెలిపారు.



ఎంపీకి స్వాగతం పలుకుతున్న మహిళలు

## మాజీ సైనిక ఉద్యోగి ఇల్లు కూల్చివేత

**ప్రజాశక్తి-రాజానగరం**

మాజీ సైనిక ఉద్యోగి వారసులు కట్టుకుంటున్న ఇల్లును సచివాలయం సిబ్బంది, పోలీసులు ప్రొక్లెయిన్‌తో కూల్చివేశారు. బాధితులను ఈడ్చుకుంటూ రోడ్డు పడేశారు. రాజానగరం పంచాయతీ పరిధిలోని సూర్యారావు పేటలో సుమారు ఐదెకరాల నాలుగు సెంట్లు చల్లయ్య చెరువు ఉంది. దీన్ని అనుకుని భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు. చెరువు ఆయుకట్టుకు సమీపంలో సుమారు 80 సెంట్ల భూమి మాజీ సైనిక ఉద్యోగికి ప్రభుత్వం ఇచ్చారని, ఈమేరకు తమ దగ్గర రికార్డులు ఉన్నాయని ఉద్యోగి వారుసులు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో చెరువు సమీపంలో ఆక్రమణలు ఖాళీ చేయాలని పంచాయతీ అధికారులు మాజీ సైనిక ఉద్యోగి వారసులకు నోటీసులు జారీ చేశారు. దీనిపై వారు కోర్టును ఆశ్రయిచామని చెబుతున్నారు. దీనికి సంభంధించిన ప్రతులను మండల రెవెన్యూ అధికారులకు, గ్రామ పంచాయతీ అధికారులకు ఇచ్చామన్నారు. ఈలోగా బుధవారం ఉదయం భారీ ప్రొక్లెయిన్‌తో పోలీసు సిబ్బంది, గ్రామ సంచివాలయం సిబ్బంది వచ్చి ఒక్కసారిగా మాజీ సైనిక ఉద్యోగి వారసులు నిర్మించుకుంటున్న ఇల్లును కూల్చి వేశారు. అడ్డు వచ్చిన తమను బరా బరా ఈడ్చుకుంటూ పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు గట్టుకు ఆనుకుని ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు 60 అడుగుల రోడ్డు వేయడానికి తమ ఇల్లు అడ్డుగా ఉండడం వల్ల తొలగించారని వారు వాపోయారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ బాబును వివరణ కోరగా చల్లయ్య చెరువు గర్భం ఆక్రమణకు గురవడం వల్ల ఇంటిని కూల్చి వేశామని చెప్పారు.




బాధితులను లాక్కెళుతున్న సిబ్బంది

## నేరాలు ఘోరాలు

### పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

శింగవరానికి చెందిన చొక్కా శ్రీనివాస్ పాముకాటుకు గురై మృతి చెందారు. వివరాలు ఇవి.. మంగళవారం ఉదయం శ్రీనివాస్ మొక్కజొన్న పంట కోతకు వెళ్లాడు. ఈ సమయంలో అతనిని పొడపాము కాటు వేసింది. ప్రథమ చికిత్స నిమిత్తం సీతానగరం పిహెచ్‌సికి తీసుకు వెళ్లారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారని శ్రీనివాస్ కుమారుడు బాలమురళీకృష్ణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ గోవింద రాజు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

### 103 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- రూ.8,90,000 జరిమానా
- 14 మందికి ఏడు రోజుల జైలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగర పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 103 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ డిఎస్‌పి ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత15 రోజులుగా నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా 103 మంది పట్టుబడ్డారని, వీరిని నాలుగవ అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొతంగా రూ 8,90,000 జరిమానా విధించడంతో పాటుగా 14 మందికి 7 రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు పర్యవేక్షణలో ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరు ముందు చేసి వాహనాల నడపకూడదు అన్నారు

### బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి-రాజోలు

విలేకరుల మంటూ బియ్యం వ్యాపారులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను తాటిపాక ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బుధవారం తాటిపాక సెంటర్ లో బియ్యం దుకాణం వద్దకు ముగ్గురు వ్యక్తులు వెళ్లి నువ్వు నకిలీ బియ్యం అమ్ముతున్నావని మాకు సమాచారం వచ్చింది. నువ్వు డబ్బులు ఇవ్వకపోతే నీ అంతు చూస్తాము అంటూ బెదిరించారు.దీంతో వ్యాపారి చేగొండి శ్రీనివాస్ మీకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని వారిని ప్రశ్నించారు.ఈ విషయాన్ని తాటిపాక ఛాంబర్ అధ్యక్షుడు అడబాల దొరబాబుకు తెలిపారు. అయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులను చూసి ఒక వ్యక్తి పారిపోగా మిగిలిన ఇద్దరిని వారు ఉపయోగించిన కారును పోలీసులకు అప్పగించారు గత కొంతకాలంగా వీరు వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు కొందరు వ్యాపారస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నకిలీ విలేకరులు భీమవరానికి చెందిన తాతారావు, ప్రశాంత్ గా గుర్తించినట్లు సమాచారం.




గొలుసు దొంగలను పోలీసులుకు అప్పగిస్తున్న స్థానికులు

### వృద్ధురాలి మెడలో గొలుసు చోరీకి యత్నం

- వెంబడించి పట్టుకున్న స్థానికులు
- కోరంగి పోలీసుల కు అప్పగింత

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు మార్కెట్ వీధికి చెందిన సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు మెడలో బంగారు చైన్‌ను లాక్కుని ఇద్దరు యువకులు బైక్ పై పరారయ్యారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు అంకాడి పాపయమ్మ అనే వద్దురాలు వెంకన్న బాబు గుడి ఎదురుగా ఉన్న వీధి నుంచి ఇంటికి వస్తూ ఉండగా మోటార్ సైకిల్‌పై ఇద్దరు యువకులు ఆమె మెడలోని గొలుసు లాక్కొని పరారైనట్లు స్థానికులు తెలిపారు. గుడి ఎదురుగా ఉన్న ఐరన్ అండ్ సిమెంట్ షాపులో పనిచేస్తున్న కార్మికులు పరారవుతున్న యువకులను వెంబడించి పట్టుకున్నారు. స్థానికులు ఆ ఇద్దరి యువకులకు దేహశుద్ధి చేసి కోరంగి పోలీసులకు అప్పగించారు. ఒక ఏడాదికాలంగా తాళ్లరేవు మండలంలో పలు చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో తాళ్ళరేవు పోస్ట్ ఆఫీస్ ఎదురుగా 60 ఏళ్ల వృద్ధురాలు మెడలో నుంచి గొలుసు దోచుకుని ఇద్దరు యువకులు బైక్ పై పరారయ్యారు. అదేవిధంగా నీలపల్లి ఆదర్శ ప్రభుత్వ పాఠశాల లో వంట మనిషి మెడలో నుంచి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు గొలుసు లాక్కుని పరారయ్యారు. చొల్లంగి వద్ద ఒక మహిళ చేతిలోని బ్యాగ్ లాక్కుని పరారయ్యారు. ఇటువంటి సంఘటనలు మండలంలో పునరావతం అవుతున్నా కోరంగి పోలీసులు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### సారా కేసుల్లో నిందితుల బైండోవర్

ప్రజాశక్తి -దేవరపల్లి

సారా కేసుల్లో పదిమంది పాత నిందితులను సత్రవర్తన కోసం స్థానిక దేవరపల్లి మండల తహశీల్దార్ ఎం.రామకష్ణ ఎదుట మంగళవారం బైండోవర్ చేసి నట్టు దేవరపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దిమ్మల సుధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాదికి రూ.లక్ష ష్యూరిటీతో సెక్షన్ 109 ప్రకారం బైండోవర్ చేసినట్లు చెప్పారు.



## యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న డిడి రవిశంకర్, ఎస్‌పి రఘునాయిగన్, పట్టణ ప్రముఖులు

### జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో యానాం బైపాస్ బీమ్‌నగర్ సమీపంలో జగజీవన్ రామ్ విగ్రహానికి హెల్త్ డిడి.రవిశంకర్, ఎస్‌పి బి.రఘు నాయగన్, పొనుగుమట్ల విష్ణుమూర్తులు, ఖండవల్లి రామకృష్ణ, పండు సిద్ధార్థ కుమార్, ప్రకాష్, లంక బంగారం, కపావతి నివాళులర్పించారు.



విద్యార్థులకు నీటి సంరక్షణ పై అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

### నీటి సంరక్షణ అందరి బాధ్యత

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక పర్యావరణవేత్త కె మత్యుంజయరావు అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల నందు ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్ లో భాగంగా నీటి సంరక్షణ అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీరు లేకపోతే జీవం లేదని, నీటిని సంరక్షించి భావితరాలకు అందించవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు.రాష్ట్ర పర్యావరణ విభాగ కన్వీనర్ కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ భారత జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నీటి ఆవశ్యకత పెరిగిందని, భూగర్భ జలాల మట్టం పెరగాలని, ఇంకుడు గుంతలను తవ్వాలని, ఇలాంటి వాటిపై ప్రభుత్వాలు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ వివిపి రాజు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయ వీరన్,కాశీ జానకి రాముడు, కరుణ, రాధా కుమారి, పి దేవి, జి శాంతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### వైద్యాధికారిగా యానాం యువతి దుర్గా భవాని

కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ విభాగంలో చెన్నై సెంట్రల్ లేబర్ మెడికల్ ఆఫీసర్‌గా యానాం యువతి డాక్టర్ మేడా దుర్గాభవానిని నియమించారు. ఈ మేరకు భారత ప్రభుత్వ ఆరోగ్యశాఖ అండర్ సెక్రటరీ దిలీప్ కుమార్ సాహూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. డాక్టర్ మేడా దుర్గా భవాని యానాం ఫరంపేట ప్రైమరీ స్కూల్‌లో ఒకటి నుండి 5వ తరగతి వరకు చదువుకుందని, ఆరోవ తరగతి నుండి పదవ తరగతి వరకు నవోదయ విద్యాలయంలో చదివిందని తండ్రి మేడా సింహాద్రి తెలిపారు.



డాక్టర్ మేడా దుర్గాభవాని

### పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

పుస్తక పఠనం కూడా ఒక ముఖ్యమైన మెదడు వ్యాయామం కాబట్టి పిల్లలు పుస్తకాలు చదవడానికి ఇష్టపడేలా పెద్దలు చేయాలని గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో పఠ ణాభిమానాన్ని ప్రేరేపించడానికి, పిల్లల పుస్తకాలపై దష్టిని ఆకర్షించడానికి 1962 నుండి ఏప్రిల్ 2న అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. బాల్యదశ నుంచి ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పుస్తక పఠనం వల్ల బాలలలో పదజాలాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు. ప్రాపంచిక వాస్తవాలనుండి లేదా వారి క్లిష్ట పరిస్థితుల నుండి తప్పించుకునే భావాన్ని పుస్తకాలు అందిస్తాయని అన్నారు. భవిష్యత్ యువ మనస్సులను రూపొందించడానికి పుస్తక పఠనం ఎంతో అవసరమని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా బాల బాలికలకు పుస్తకాలు బహుకరించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ వెంకటరమణ, అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

### సమతులాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

బాల్యం నుంచి పిల్లలకు అధిక పోషక విలువలు గల సమతుల్య ఆహారాన్ని అందించడంతో ఆరోగ్యంగా ఉంటారని పోషకాహార నిపుణులు పి.పార్థసారథి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఇష్టపడే జంక్ ఫుడ్ పిల్లల దరిచారనివ్వరాదని అన్నారు. నూడుల్స్, సమోసా , కేకులు, పిజ్జా, బర్గర్లు, చిప్స్ వంటివి పిల్లలకు అలవాటు చేయకూడదని అన్నారు. ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాలనే పిల్లలకు అందివ్వాలని, బయట వాటిని పెట్టరాదు అని అన్నారు. ఇలా చేయడం వలన జ్ఞాపకశక్తి తగ్గడంతో పాటు పలు రకాల అనారోగ్య రుగ్మతలకు గురవుతారని వివరించారు. అధిక పోషకాహార విలువలు గల ఆహార పదార్థాలను ఆహారంగా పిల్లలకి అందివ్వాలని పార్థసారథి సూచించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్. శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### రైలు చార్జీల్లో రాయితీలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వృద్ధులలో అధికులు దారిద్ర రేఖకు దిగువన ఉన్నందున కేంద్ర ప్రభుత్వం సానుభూతితో స్పందించి వద్దుల రైలు ప్రయాణ రాయితీలను తిరిగి పునరుద్ద రించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధ రాజు సత్యనారాయణ రాజు కోరారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం వద్దుల రైలు ప్రయాణ చార్జీల రాయితీని రద్దు చేసిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నివసించే వృద్ధులలో 95 శాతం పేదవారేనని అన్నారు. వివిధ రకాల అనారోగ్య కారణాలతో పట్టణాలు, నగరాలలో లభించే వైద్య చికిత్స కోసం రైల్వే రాయితీలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవని అన్నారు. రైళ్లలో వద్దులు ప్రయాణించాలంటే ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నందున రాయితీని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సత్యనారాయణ రాజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్, గల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### న్యాయం చేయాలంటూ
# టవర్ ఎక్కిన యువకుడు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల ఏలేశ్వరం నగర పంచాయతీ మాస్టర్ డ్రెయిన్ నిర్మాణాలు నిమిత్తం ఆక్రమణల తొలగింపులో తనకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ న్యాయం చేయాలంటూ దిబ్బల పాలెంకు చెందిన శిడగం శ్రీనివాస్ సెల్ టవర్ ఎక్కాడు. దీంతో సుమారు 6 గంటల పాటు ఉత్కంఠత నెలకొంది. ఎంతోకాలంగా లింగంపర్తి రోడ్ లో షాపులు నిర్మించుకుని అద్దెకిచ్చి వచ్చే అద్దెతో తన కుటుంబం జీవిస్తున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటన స్థలానికి ప్రతిపాడు సీఐ ఆర్.కిషోర్ బాబు తన సిబ్బందితో చేరుకుని టవర్ దిగాలని ఫోన్ చేసిన ఫలితం లేకపోయింది. దీంతో సీఐ స్వయంగా టవర్ పైకి ఎక్కి బాధితుని వద్దకు చేరుకుని న్యాయం జరిగేలా చూస్తానని రెండు గంటలపాటు బతిమాలిన తమకు న్యాయం చేస్తామని లిఖిత పూరకంగా హామీ ఇచ్చేవరకు దిగేది లేదని బాధితులు చెప్పాడు. మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ఉదయం 11 గంటల నుంచి ఐదు గంటల వరకు కిందకు దిగేది లేదని భీష్మంచి కూర్చున్నాడు. కమిషనర్ ఆక్రమణ తొలగింపు విషయంపై బాధితులు కోర్టుకు వెళ్లారని, కోర్టు ఆదేశాల ప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు. ఎట్టకేలకు సాయంత్ర 5 గంటలకు బాధితుడు టవర్ దిగడంతో వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




సెల్ టవర్‌పై ఎక్కిన యువకుడితో టవర్ పైకెక్కి చర్చలు జరుపుతున్న సీఐ కిషోర్

# వెయిట్ లిఫ్టింగ్‌లో మహిళల ప్రతిభ అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

శారీరిక బలాన్ని పెంపొందించడానికి తోడ్పడే వెయిట్ లిఫ్టింగ్‌లో కూడా మహిళలు పాల్గొని పలు పతకాలు సాధించడం హర్షణీయమని ప్రముఖ క్రీడాకారుడు, దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల పాట్నాలో జరిగిన మహి ళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్లో రజిత పతకం సాధించిన కాదులూరి అభిషిక్త అభినందన సభ నిర్వహించారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్లు బలం అథ్లెటిక్స్ లో కీలకమన్నారు. వెయిట్ లిఫ్టింగ్ లో శిక్షణ వలన ఆత్మవిశ్వాసం తో పాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రముఖ సామాజిక వేత్త రాజారపు మహేష్ మాట్లాడుతూ భువనేశ్వర్‌లో సోషియాలజీ ఆనర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభిషిక్త బుద్ధగయలో జరిగిన జూనియర్ నేషనల్ టోర్నమెంట్లో కాంస్య, ఇండోర్లో జరిగిన యూత్ నేషనల్ టోర్నమెంట్‌లో కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. ఈ సందర్భంగా మహేష్ అభిషిక్తకు రూ.ఐదువేల బహుమతిగా అందజేశారు. అనంతరం అభిషిక్త మాట్లాడుతూ తాను ఇప్పటికే జాతీయ స్థాయిలో ఎనిమిది సార్లు వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. పెద్దల ఆశీస్సులతో వెయిట్ లిఫ్టింగ్ లో మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో అభిషిక్తను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ఎస్.శ్రీ నగేష్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, రాజా, అడబాల సత్యనారాయణ, రాఘవరావు పాల్గొన్నారు.




సెల్ టవర్‌పై ఎక్కిన యువకుడితో టవర్ పైకెక్కి చర్చలు జరుపుతున్న సీఐ కిషోర్

# యదార్థ సంఘటనే 'వారెవ్వా జతగాళ్లు' చిత్రం

ప్రజాశక్తి - సామర్లకోట

తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఒక యదార్థ గాథ ఆధారంగా రూపొందించిన చిత్రమే వారెవ్వా జతగాళ్లు చిత్రమని చిత్ర దర్శకులు సలాది సత్య, హీరో పిట్టా లక్ష్మణ్ (సతీష్) అన్నారు. సామర్లకోట పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాల వద్ద గల చిత్ర హీరో లక్ష్మణ్ గహంలో "వారెవ్వా జతగాళ్లు' చిత్ర పోస్టర్ ఆవిష్కరణపై బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్య మాట్లాడుతూ ఎవరు ఊహించని రీతిలో తమిళ నాడు రాష్ట్రంలో జరిగిన ఒక యదార్థ గాథను ఈ చిత్రంగా రూపొందించామన్నారు. చిత్రం గ్రాఫిక్స్ దాదాపుగా పూర్తవుగా ప్రస్తుతం చిత్రం సెన్సార్ బోర్డు లో ఉందన్నారు. త్వరలోనే విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం కుటుంబాలతోపాటు హాయిగా చూసి ఆనందించేలా ఉంటుందని, పజలు చిత్రాన్ని ఆదరించాలని కోరారు. పెద్దాపురం మహారాణి కళాశాలలో చదువు కున్న తాను ఇదే కళాశాలలో ఫిలిం అకాడమీ నిర్వహిస్తూ ఇంకా ఉభయగోదావరి జిల్లాలో ఉన్న పేద కళాకారులకు తన వంతు ప్రోత్సాహం అందిస్తూ సినీ రంగంలో ప్రవేశానికి అవకాశాలు కల్పించనున్నట్టు దర్శకులు సత్య చెప్పారు. కాగా సమావేశంలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి నటనపై ఆసక్తితో తాను పెద్దాపురంలో ఎస్ఎస్ ఫిలిం అకాడమీ లో జరిగిన ఫిల్మ్ ఎడిషన్‌లో పాల్గొని తన ప్రదర్శన వీడియోలు దర్శకులు సత్యకు అందించగా ఆయన తనకు అవకాశం ఇస్తూ, 7 నెలల పాటు నటనలో శిక్షణ ఇచ్చి, తనకు హీరో పాత్రను అందించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, చిత్ర బృందం "వారెవ్వా జతగాళ్ళు" చిత్రం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మరో సినీ దర్శకులు కెబి ఆనంద్, దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజేష్, పలువురు కౌన్సిలర్లు, కళాకారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న హీరో పిట్టా లక్ష్మణ్ (సతీష్)

### నూకాలమ్మ హుండీల ఆదాయం రూ 16. 34 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాండ్రకోటలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ లను బుధవారం లెక్కించగా రూ 16 లక్షల 34, వేల 733 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ తలాటు వెంకట సూర్య నారాయణ తెలిపారు. దేవదాయ ధర్మా దాయ శాఖ నియమించిన తనిఖీ అధికారి చల్లా ఉదయ్ కుమార్ బాబు సమక్షంలో 20 రోజులకు సంబంధించి హుండీలను తెరిచి లెక్కింపు జరిపారన్నారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ చైర్మన్ గవరసాన వీరస్వామి (బాబ్జి) జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, జోకా నానాజీ, పల్లా గంగారావు, కమిటీ సభ్యులు బావిశెట్టి గంగరాజు, రొంగల తమ్మారావు, లక్కాకుల కష్ణ, వేమవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది




సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్ పట్నాయక్

### ఆటిజం రుగ్మత ఉన్నవారికి చట్టరీత్యా రక్షణ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

ఆటిజం వైకల్యం ఉన్న వ్యక్తులందరికీ అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛ, స్వాభావిక విలువలను మెరుగుపరచేలా చట్టరీత్యా రక్షణ కల్పించినట్టు న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటిజం అనేది జీవితకాల సంక్లిష్ట పరిస్థితి అని ఇది బాల్యంలో వ్యక్తమయి జీవితాంతం కొనసాగుతుందన్నారు. ఆటిజం బారిన పడిన పిల్లలు సరిగ్గా మాట్లాడలేరని, చదవలేరని అన్నారు. బాలికలతో పోలిస్తే బాలురలో నాలుగు రెట్లు ఎక్కువ అన్నారు. ఇది జన్యుపరమైన కారణాలవల్ల వస్తున్నట్లు వైద్య పరిశోధకులు గుర్తించారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గౌరీశేఖర్

### బూస్టర్ డోస్ విధిగా వేయించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

కోవిడ్ కేసులు నానాటికి పెరుగుతున్నందున ముఖ్యంగా వృద్ధులు బూస్టర్ డోస్ వేయించుకోవాలని డాక్టర్ గౌరీ శేఖర్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ గా పిలువబడుతున్న ఎక్స్ బి బి 1.16 కొత్త వేరియంట్ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు వార్తలు వస్తునందున అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరంతో పాటు జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నవారు ఇతరులకు దూరంగా ఉండాలన్నారు. కొత్త వేరియంటును నిరోధించడానికి గాను రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వద్దులు, తీవ్రమైన జబ్బులతో బాధపడే ఇతరులు తప్పని సరిగా బూస్టర్ డోస్ వేయించుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ విధిగా మాస్క్ ధరించాలని డాక్టర్ గౌరీ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,రాఘవరావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రయివేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచిత విద్య

ప్రజాశక్తి-మండపేట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయివేటు స్కూల్లో ఉచితంగా చదువుకునే అవకాశం పేద విద్యార్థులకు కల్పిస్తున్నట్లు మండల విద్యా శాఖాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ద్వారా ప్రతి ప్రయివేటు స్కూల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాల్సి వుంటుందన్నారు. అయితే కేవలం 1 వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, ప్రతి ఏటా ఒకటో తరగతి చదువుకునే విద్యార్థులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం వుందన్నారు. లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులకు స్కూళ్లను కేటాయిస్తారన్నారు. ఏడాదికి రూ.లక్షా 20 వేల ఆదాయం దాటని ప్రతి ఒక్కరూ ఈ పథకంలో పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. ముందుగా విద్యార్థి ఏదైనా మీ సేవా కేంద్రానికి వెళ్లి తన పేరును రిజిష్టర్ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం వున్నట్లు చెప్పారు.

### 'శ్యాప్' అధ్యక్షునికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలో హోటల్ ప్రారంభోత్సవానికి వచ్చిన శ్యాప్ అధ్యక్షుడు, వైసిపి యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి ఆ పార్టీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాసు, తోట పథ్వీరాజ్, పలువురు పార్టీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో జ్ఞాపికను అందజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైసిపి నాయకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

### ఎన్నికలకు టిడిపి శ్రేణులు సన్నద్ధమవ్వాలని పిలుపు

ప్రజాశక్తి-కొత్తపేట

ఏడాది లోపులోనే ఎన్నికలు సమీపిస్తున్నందున టిడిపి శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు కోరారు. మండల పరిధిలోని వానపల్లిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల వీరన్న అధ్యక్షతన గ్రామ పార్టీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ సంబంధించి వానపల్లి గ్రామంలో 12 బూత్‌ల్లో పూర్తిస్థాయిలో బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు ఓటర్ వెరిఫికేషన్ లో పాల్గొన్నందుకు అభినందించారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.